కథ

# రాక్షస సంహారం

- వారాల కృష్ణమూర్తి

**నాగన్నకు ఆకాశంలోని చుక్కల్ని చూసి కాలాన్ని కొలవడం తెలుసు.**

పగలు సూర్యుడి గమనాన్ని కాలంతో ముడేసి చెబుతాడు.

కాలాన్ని కొలిచే విద్య తండ్రి వారసత్వంగా తెచ్చుకున్నాడు. అరవై ఏళ్ళలో కళ్ళముందు నిలిచిన వసంతాలని నెమరు వేసుకుంటున్నాడు. మోడులు మొలకెత్తిన చివుళ్ళు, పూచిన కొమ్మలు, చీరిన ముళ్ళ రెమ్మలు. రాను రాను బతుకు భారంగా గతం దూదిపింజంలా తేలికగా మాయలా కరిగిపోవడం చిత్రంగా అనిపించింది.

తండ్రి నాగులు బ్రతికున్నంతకాలం సంగటి - తునకల కూర తట్టలో కళకళ లాడేది. తల్లి మసాల నూరుతూనే తనకు ఎక్కువగా కనిపించేది చిన్నతనంలో.

రోజుకో రుసి.

కోళ్ళు. పెట్ట పుంజు ... అందులో గుడ్లకోడి పందెం పుంజులు. చెరువు కోళ్ళు ... పోట్టేలు కూర - తలకాయ కాళ్ళు ... కలీజ ... బోట.

అన్ని రుసులు దేనికవే సాటి - మరీ అద్దుమానమంటే నెత్తర ఉప్పు కారం ఏసి తాలింపేస్తే దానెమ్మ అదీ పీక్కు తినాలనిపించేది.

నోటికింద తక్కువగా పడింది సేపే - సేప అపురూపం. నీల్లుంటే కదా సేపలు. సేపల కూరంటే గొప్పిల్లే. ఎప్పుడన్నా రెడ్డోరి బాయిలో రెండు సేపలు సిక్కితే.

ఒరే ! పెద్దిరెడ్డికి సేపలంటే తగని ఇదిరా ! అంటూ ఆశపడీ పెద్దరెడ్డి తల్లికే ఇచ్చేవాడు. ఆ యమ్మ కనీసం అంత పులుసన్నా ఏసేది కాదు.

అప్పుడోసారి కనీవినీ ఎరగని వానలు. ఎప్పుడూ ఎండి సచ్చే వాగులు వంకలు సెరువులూ నిండి సచ్చినాయి. గట్లు తెగి వూరంతా తడిసింది. నీటి వాసనతో కప్పల బెక బెకతో వూరంతా కళ కళ లాడింది. అదిగో అప్పుడు సిన్న పెద్ద కుటుంబాలన్నీ సేపలు మనసారా తిన్నారు. ఎక్కడ నుండి కొట్టుకొచ్చాయో ఏ గుంటలో సూసినా సేపలే. సేపల పంటే.

అమ్మ ఆకాశంలో సుక్కలు సూపించి, ఓ సుక్క సాటున మనక మనగ్గా తలుక్ మని మెరిసే మాయమయ్యే సుక్కను సూపి - ఆ సుక్కమ్మ మొగుడు తెచ్చే సేపల కోసం మసాల నూరుతుంటే ముక్కున ముక్కెర తలుక్ తలుక్‌మని మెరుస్తుంది అని సెప్పి నవ్వేది. ఆ నవ్వులో సుక్కల సొంపులన్నీ దీపం వెలుగులో కనిపించేయి.

ఆరోజులు ... ఆ రుసులు ... ఆ మనసులే ఏరు. మాటంటే మాటే ...

ఆ మాటకోసమే పెద్దిరెడ్డి నాయన సంపిన కేసు నెత్తినేసుకుని జైలుపాలయ్యాడు నాయన. జైల్లో సంవత్సరం తిరక్కుండానే విసంజొరం వచ్చి ఇంటికి రాకండానే పాయగదా !

మాటంటే మాటే !

పెద్దిరెడ్డి, నాయన తనకోసం జైలు కెల్లాడని ఇంటిని కాసుకున్నాడు. పొలంలోని పంటను నేరుగా ఇంటికే తోలించేవాడు. అమ్మా ... తను ... ఇద్దరు తమ్ములికీ అయి మిగిలేయి గింజలు. పైకర్చులకు అడక్కుండానే అంతో ఇంతో ఇచ్చేవాడు. తోటలోని అక్కూరలుగాని కాయగూరలుగాని ఎవరు పోయినా వడికి కోసుకోవచ్చు.

నాగన్న మంచంలో కుడుతున్న నల్లుల్ని తిట్టుకుంటూ లేచాడు.

మద్దేనం ఎండకేసి నాలుగు పక్కలా నులకను జరిపి జరిపి నల్లుల్ని చంపినా - నులకను బిగదీసి - కట్టెలో కొట్టి నేలరాలిన నల్లుల్ని మనవడు కాలరాస్తుంటే "ఒరే అబ్బోడా రాత్తిరికి ఆయిగా పడుకోవచ్చు, సంపు-" అంటూ వుషారు పెట్టింది గుర్తొచ్చి మనవడిని చూశాడు.

వాడు నిద్రలో ఆదమరచి వున్నాడు. "పడుకో

కొడకా పెద్దైనాక కంటికి నిద్దర కరవైపోతుంది ... పడుకో..." అంటూ చీకట్లోనే చెప్పులు తారాడి కాళ్ళకు తగిలించుకొని చుట్టూ కలియ చూశాడు. గుడిసె చుట్టూ అడ్డదిడ్డంగా పేర్చిన రాళ్ళు రప్పలు సరిహద్దు రేఖలా వెన్నెట్లో కనిపిస్తున్నాయి. దిండు కింద దాచిన బీడీకట్ట - అగ్గిపెట్టె అందుకుని గుడిసె వైపు చూశాడు. గుడిసె లోపల కొడుకు, కోడలు. వాడు బండి దిగాడు సందేల. టమేటాల బెంగలూరుకు తోలకపోయి ఏసొచ్చె లారీ నడుపుతుంటాడు. నెలకు నాలుగుసార్లు పోతాడు. పోయిన పతిసారి మూడు నూర్లు చేతిలో పెడతాడు సావుకారి. సావుకారి కన్నుగప్పి వచ్చేటప్పుడు చిన్న చిన్న సామానులో, జనాల్నో ఏసుకొచ్చి అంతో ఇంతో వీడు, మరో ఇద్దరూ, బండిమీద సంపాదిస్తారు.

ఎందుకురా అన్నాయం అంటే '... మనకు నాయం జరుగుతుందా !' అంటాడు.

గుడిసె గోడకానుకుని అయిదులీటర్ల పెట్రోలు డబ్బా - అదీవాడు తెచ్చిందే - దాన్నందుకున్నాడు నాగులు. నాలుగయిదు డబ్బాలు గుడిసెలో ఉన్నాయి. చెంబులు తప్పేలాలు లేనోల్లకు డబ్బాలే నీల్లు నింపుకోనూ, బైటికిపోనూ ...

"ఒరే సీనప్పా ! నేను బైటికి పోతున్నా. అబ్బోడు ఒక్కడే వున్నాడు మంచంపైన ... చూసుకో ..." అని గుడిసెలోనికి చూశాడు.

"యాలగాని ఏల ... ఏం తింటివి మామా ... నువు పో ... నే చూసుకుంటా !" లోపలినుండి కోడలి జవాబు.

డబ్బా చేతిలో పట్టుకొని గుడిసె కప్పులో చెక్కిన వేట కొడవలి తీసి నడుంలో వంచ ఘాటున దోపుకున్నాడు. నాలుగడుగులు వేసి చుట్టూ చూశాడు. గుడిసెలు గూళ్ళలా వెన్నెల్లో నానుతున్నాయి. ఆకాశంలోనికి చూశాడు.

"పదకొండు దాటింది !" అనుకుంటూ కదిలాడు.

గతమూ కదిలింది.

పెద్దాయిన బతికినంతకాలం ఆ యింట్లో మనిసిలా తిరిగాడు. ఆయన తరువాత తిరిగాడు. కాకుంటే ఈ రెడ్డికీ నాయనమాట మీద గురేకానీ తన మాట గురైందా కాదా అని సూడడు. మంకుతనం ఎక్కువ.

తనేం తప్పు చేశాడు ?

"ఒరే నాగన్నా ... రాత్తిరికి రాత్తిరి ఆ రామిరెడ్డి చీనా చెట్లు నరికి అవతల పారై ... నీతో పాటు మనోల్లను అందరినీ తీసుకపో ..." అని పురమాయించినాడు.

"రెడ్డీ ... ఇదేందప్పా ... ఇది మనకు తగదు. రామిరెడ్డికి మనకూ తగవుంటే నేరుగా ఆయనతోనే తేల్చుకుందాం ! మద్దిన చీనా చెట్లు ఏం జేసినై. పచ్చని చెట్లు నరకడం నాకు చేతులురావు. కాదంటే సెప్పు పంట రాంగానే మొత్తం పంటకోసుకుందాం !" అంటే ..


"అమ్మ బోయనాకొడకా ! నా మోచేతికింద నీల్లు తాగే నాయాలివి నువ్ నాకు నీతులు చెప్పబడితివి... మీ నాయన జైల్లో సచ్చినా ఇంత నోటికి అనువుగా అందిస్తున్నాం గదా ... అదిరా తప్పు. నమ్మకద్రోహం నాకొడకా ..." కాని కాలమెట్టు తీసుకొని చొక్కా పట్టుకున్నాడు.

"ఇదో రెడ్డీ ! మీ నాయన ఏం జేసినాడో ... మా నాయన ఎందుకు జైలుకు పోయినాడో నీకు తెలియకపోతే ఎల్లి మీ యమ్మనడుగు. ఆమె గూడ మర్సిపోతే గుంతకెల్లిన మీ నాయన్నడుగు. మాటకు పానమిస్తాం ! మీ నాయనకిచ్చిన మాట కోసమే జైల్లో సచ్చినాడు మా నాయన. మా నాయనకిచ్చిన మాటకోసమే మీ నాయన మమ్మల్ని సూసుకున్నాడు. ఆ మారాజు పోయినా ... ఆయన మొగం జూసి ఈ ఇంటిని అంటి పెట్టుకుని నిన్ను మా రాజులా జూసుకుంటున్నాం. సరే దేనికొచ్చిందో ఏమో ! నీ కడుపులో మాట బైటకొచ్చింది. బోయీలే లేకుంటే మీరు రాజ్యాలు ఏలలేరు. రాజకీయాలు సెయ్యలేరు. యాడ దొమ్మీ జరిగినా మేమే. మీ కడుపులో కూడు కదలకుండా అవతలోడి తల మీ ముందు బెడ్తుండ్లా ... అదీ తప్పు. ఆ దొమ్మీల్లో పోతే పోయేది మా పానాలే గదా ! అని ఎప్పుడూ అనుకోలా. ఈరోజు తెలిసింది బోయోడు ఎంత తెలివితక్కువ నాకొడుకో ..." అని రుసరుసా ఎలబారి వచ్చేసిందాయె.

ఆరోజు నుండి కొత్తబతుకు బతకాలని

ఎలా బతకడం ?

రోజూ పనీ పాట లేకుండా ఆ రెడ్డి ఎంట తిరగడం.




ఆయనిచ్చే గింజలకి డబ్బులకి రెడ్డికి గిట్టని వాళ్ళందర్నీ బెదరించడం ... తన్నడం. లేదంటే కాలో చెయ్యో తీసెయ్యడం. తప్పదంటే మనిసినే లేపెయ్యటం.

ప్రెసిడెంట్‌గిరి కోసం మెంబర్లని ఎత్తకపోయి దాచిన రోజులు, ఎమ్మెల్లే కోసం పోటీ చేసినోన్ని సంపి ఎలచ్చన్లు వాయిదా ఎయించి రెడ్డిని ఎమ్మెల్లే సెయ్యడం ... అంతా ఒంటి చేత్తో జరిగాయి. అంతటి చెయ్యి పనికోసం ఒకరిముందు చాపలేక నచ్చిపోతుంటే నాయుడి కబురు.

"ఏందిరా నాగన్నా ! రాత్రిపూట ఒక్కడివే పోతున్నావ్ ?" ఊరి చివర గుడిసె ముందు తడికె మంచం మీద నిద్రరాక కూర్చున్న ఎరికలరాముడు పలకరించాడు.

"బైటికిలే ... నిద్దర్రాలా !"

"ముసలోడివైనా అంతదూరం సెరువుకు పోవాలా... సెరువుకు పోకురో జీవాలుంటాయి ... ఇస్రితం నాయాలివి పలకవేందిరా ! ఓ బీడీముక్క ఇచ్చిపో ".

బీడీ ఇచ్చాడు నాగన్న. ఎరికల రాముడు దిండుకింద అగ్గిపెట్టె తడుముకుని అంటించుకున్నాడు. నాగన్న గబగబా ముందుకు సాగిపోయాడు.

"జాగర్తరే ... మొన్న సిరతే కనిపించిందట".

నాగన్న వినిపించుకోకుండా పోతున్నాడు. మామిడి తోపులోని సారాయి అంగడి వైపు నడిచాడు. అంగడి ముందు వసారాలో బల్లమీద కునికిపాట్లు పడుతున్న ఓబులు మనిషి అలికిడి విని "ఎవరది ... అంగడి మూసిండ్లా ? ఓ ... ..." అన్నాడు.

"మూస్తే ... మల్లీ తెరుస్తావు ... నేనురా నాగన్నను"

"నాగన్నా ... నాగన్నంటే ... ?"

"ఎల్లి మీ నాయన్నడుగు నాగన్నంటే ఎవులని ?... ఎందిరా అప్పుడే కల్లు నెత్తికెక్కినాయా !"

వెన్నెల వెలుగులో పోల్చుకుని "నువ్వా నాగన్న తాతా ... నువ్వేందిట్లా రావడం ... ఇంత రాత్రప్పుడు"

"రెండు పాకెట్లు తే ...."

ఓబులు తలుపుతీసి లోనికెళ్ళి రెండు పాకెట్లు తెచ్చి నాగన్న చేతిలో పెట్టాడు.

తండ్రి చెప్పేవాడు నాగన్న వేటకు పోయేటప్పుడు మందు కొడతాడని. ఆ కత్తికి ఎదురు లేదని. అలాగని వాడు చెడ్డోడు కాడని కతలు కతలుగా చెప్పేవాడు.

"ఇదోరా లెక్క ..."

ఓబులు డబ్బులు తీసుకొని చిల్లరకోసం దేవులాడబోయాడు.

"అక్కల్లా వుంచుకో ..."

నాయన చెప్పింది నిజమే. నాగన్న సిల్లరకు సెయ్యి సాచడు. ఆడిది పెద్ద చెయ్యి.

"ఏంది తాత ... ఏలగాని ఏల ... అసలు నువ్ మందు తాగడం ఇనడమే గాని సూడలా ... మందేసుకుంటుండావంటే మనసు చెదిరా !"

"అదరడం సెదరడం కాదురా .... కుదురుకోసం. పట్టు జారకుండా వుండను". అంటూ ఓ పాకెట్టు పంటితో పొడిచి గటగటా తాగాడు. రెండో దాన్నీ ఒక్క వుదుటున పీల్చేశాడు. పెదాల మీద తడిని నాలుకతో తుడుచుకొని మీసాలు సవరించుకుని కదిలాడు.

వేటకు బయలుదేరిన సింహంలా !

"ఒరే నాగన్నా నిజంగా నువ్ సింహమే కొడితే ఏనుగునే కొడతావ్... చిన్న చిన్న జీవాల్ని వేటాడవు. అందుకే నువ్ నాకు నచ్చావురా ! పెద్దిరెడ్డి గానీ రామిరెడ్డిగానీ ... అల్ల రెడ్ల దర్బారు ఎవరు పడతార్రా ! నువ్ మగోడివి కాబట్టి కాదని ఎదురు నిలిచావ్. ఒరే... నేనూ ఒకడికి తలవంచి బతకను. నాకు నీలాంటోడు ఒక్కడుంటే సాలు వూరిని మార్చేస్తా. రా ... నాతో వుండు. నీకు ఏ కొరతా రానీను. నువ్ నా పక్కనుంటే సాలు. అర్జునిడికి క్రిష్ణ పరమాత్మలా !" అన్నాడు నాయుడు.

"అంత మాటెందుకులెండి. అట్లాగే కానీయండి. కానీ ... ఒక్కటి ! ఏదైనా మొగోడు చేసేపని చెప్పాల .."

మద్దెలో పెద్దిరెడ్డి పిల్చినాడు. పాకపోయే సరికి వాల్లమ్మ వచ్చింది కర్ణుడి దగ్గరకు కుంతిలా. ఆయమ్మకు నచ్చచెప్పి పంపేసరికి రామిరెడ్డి సాయంగా వచ్చి తన పక్కన నిలబడమన్నాడు. రెండెకరాలు రాసిస్తానన్నాడు. ఎవరెన్ని చెప్పినా మాటకు కట్టుబడేది బోయోడే అనిపించుకొని నాయుడి దగ్గరే వుండిపోయాడు.

పనీ పాట లేకుండా నిజం చెప్పాలంటే గాటికి కట్టేసి మేపినట్టు మేపాడు కుటుంబాన్నంతటినీ నాయుడు.

పంటపండించడం ... మార్కెట్టుకు తోలడం. వచ్చిన లాభాలతో భూములతో పాటు చుట్టుపక్కల పంటలు కొని సమయాన్ని బట్టి ఊర్లోనో, పొరుగూర్లోనో అమ్మడం. వ్యాపారాల్లోనూ ... అప్పులు ఇచ్చి పుచ్చుకోవడంలోనూ అన్నింటా నాయుడు తానే అయి కష్టపడేవాడు. అతని వెంట నాగన్న. నాగన్న అంటే వంటను అమ్మడంలో అప్పులు వసూలు చెయ్యడంలోనూ కొత్త వ్యాపారస్తులతో లావాదేవీల్లోనూ నాయుడు పెట్టిన పెట్టుబడికి గ్యారంటీ కార్డు. పట్టిందల్లా బంగారమే - సంపాదించిన సొమ్మును భద్రపరచుకోను అధికారం అవసరమయింది నాయుడికి. చదివి సాధించలేని పదవి ఒక్క రాజకీయ నాయకుడు కావడమే. అందుకే దానికోసం పరుగులాట. నాయుడితో పాటు నాగన్నకు పరుగే. కాదంటే వుల్లాసం నాయుడిది ఆయాసం నాగన్నది.

"ఒరే నాగన్నా ! ఆడిని దెబ్బతీయాలంటే ఒక్కటే"

"ఏందప్పా !"

"అది చెప్పేది కాదు. పదా !" అంటూ కారులో ఎక్కించుకున్నాడు. వూరుదాటి బెంగలూరు రోడ్డుమీద అరగంట పోయాక కారు రోడ్డుదిగి గుబురు తుప్పల చాటుకు పోయి ఆగింది.

నాయుడు నాగన్న మరో ఇద్దరూ కారు దిగారు.

"ఒరే ! ఇంకాస్సేపటిలో ఆ రెడ్డికారు ఇటు వస్తుంది. కారు ఆపి ... వాడిని బయటకు లాగి మనం తీసుకపోయి దాచేస్తున్నాం".

నాగన్నకు అర్థమయింది. నాయుడిని కారులోనే కూచోమన్నాడు. తమతో వచ్చిన మరో ఇద్దరినీ రోడ్డు మీదకు పంపి కారు వస్తుందేమో చూడమన్నాడు. నాయుడు కారులో ఒంటరిగా కూచోలేక నరాలు బిగదీస్తున్న నిశ్శబ్దాన్ని మోస్తూ కారుదిగి నాగన్న పక్కకు చేరాడు.

"కారు .."

"ఆపండి !"

దారికడ్డంగా నిల్చుని ఇద్దరూ కారాపారు. డ్రైవరు కారాపడం. ఆ ఇద్దరూ డ్రైవర్ మీదకి పోవడం. "ఎవర్రా అది !" అని అరుస్తున్న డ్రైవర్‌ని లాగి ఒకడు తన్నడం.

మరోడు కారు లైట్లు బద్దలు కొట్టడం క్షణంలో జరిగిపోయాయి.

నాగన్న వేట కొడవలి వూపుకుంటూ కారు దగ్గరకొచ్చి తలుపు తీశాడు. కారులోని మసక వెలుతురు చిమ్ముతున్న కాంతిలో భయకంపితులై ఆడవాళ్ళు.

"ఛా ... ఛా ... ఆడోల్లండీ ! తల్లీ కూతుల్లు !"

"అయినా ఫరవాలేదు. వాళ్ళను దాచేస్తే దిగొస్తాడు. తీసుకరా !" నాయుడి ఆజ్ఞ.

"ఛ ... ఆడోల్లమీద పతాపం ఏలప్పా !"

"శ .. ఏడవకు రెడ్డెమ్మా ! మీకేం బయం లేదు"

"ఒకే నాగన్నా" తుప్పలమాటునుండి కేక

"ఇంకే చెప్పకండి సామీ ! ఈల్లని దాచెయ్యడం మగతనం కాదు. మనకు ఇరోదం రెడ్డితో వాల్ల ఆడోల్లతో కాదు. వాల్లకేమీ ఆపద జరగ్గొడదు ..."

పరిస్థితి మించిపోయిందని నాయుడు, "విశ్వాసహీనుడు. ఒరే ముందు వాడిని ఏసైండి" అని అరిచాడు.

"నన్నేసేవోడు ఇంకా పుట్లా. నేను ముందే చెప్పానుగదా. ఆడంగి వనులు చెయ్యనని. రండి ఎవరొస్తారో ... నరికి పారేస్తా. రామ్మా ... చిన్నమ్మా, కారు నడుపు ..."

ఇంకెంతకాలం ఈ పాడు బతుకు. ఎవడితో వున్నా కూనీలు సెయ్యాల్సిందే. కూనీలు సెయ్యడం కొత్తకాకున్నా చీటికీ మాటికీ సంపడం - అందునా ఎనకా ముందూ సూడకుండా ఆడోల్లు పసోల్లు అనకుండా సంపడ మేమిడిది. థూ ... అని రోత పుట్టి ఆ బతుక్కు చరమగీతం పాడాడు.

చిన్నమ్మ వెనకసీటు వదిలి ముందుకు వచ్చింది. నాగన్న కారు ఎక్కాడు.

"కారు ఎనక్కి తీమ్మా ! ఇంటికాడ దిగబెడతా!"

చీకట్లో కారు వెనక్కి తిరిగింది.

నాగన్న బతుకు వెనక్కి తిరిగింది.

ఇంకెంతకాలం ఈ పాడు బతుకు. ఎవడితో వున్నా కూనీలు సెయ్యాల్సిందే. కూనీలు సెయ్యడం కొత్తకాకున్నా చీటికీ మాటికీ సంపడం - అందునా ఎనకా ముందూ సూడకుండా ఆడోల్లు పసోల్లు అనకుండా సంపడ మేమిడిది. థూ ... అని రోత పుట్టి ఆ బతుక్కు చరమగీతం పాడాడు.

కొత్త బతుకు ....

ఎవరిస్తారు ?

ఎవరి బతుకు ఎవరిస్తారు ...

ఎవరి బతుకు వారు వెతుక్కోవలసిందే ....

వెతుకులాటలో ఇదం వదం అన్నోడికి బతుకుండదు.

తమ్ముళ్ళిద్దరూ ఇంకా రెడ్ల వెంట నాయుళ్ళ వెంట పరుగులు పెడుతున్నారు. కులంలో చాలామందికి ఎవరో ఒకరి అండన బతకడం అలవాటయింది. తక్కువమంది సొంతంగా కలో గంజో ... కూలో నాలో... అని బతుకులీడుస్తున్నారు.

ఆకాశంలోంచి సుక్కలు రాలడంలేదు. నేలంతా చీలికలే ... కూలోడి బతుకులా.

వాన సుక్కలేక పొలాలు ఎండిపోయె. పశువులు వట్టిపాయె. బతుకులు వాడిపాయె. వున్నోడు దాచుకుంది తింటున్నాడు. లేనోడు పొట్ట చేత్తో పట్టుకుని పోతున్నాడు.

వూళ్ళకు వూళ్ళే వలసలు పోతున్నాయి.

జనం పనుల్లేక అడ్డమైన పనులూ చేస్తున్నారు.

ఆ మద్దె పెద్దకొడుకు పట్నంలో ఎవరినో సంపను ఒప్పుకుని యాభై వేలు తీసుకున్నాడని తెలిసింది. "ఏందిరా" అంటే

"బతికే మార్గం ఏది ?" అన్నాడు.

"వాల్లెవరో ... వాల్లతో మనకు పగేంటి ... మరీ కిరాయికి కూనీ సెయ్యడం ఏందిరా ?"

"మనిషికి మనిషికి ఏంది నాయనా వుంది. డబ్బు లేంది ఏందీ లేదు. అమ్మ సచ్చె. దాని దినాలు సరిగా చెయ్యలేకపోతివి. నీతిగా బతకాలంటావు. ఎలా బతకాలంటావు. కూలి చెయ్యచ్చు. కూలేది ? ఎవరు పిలుస్తున్నారు కూలికి ? మరి ఎలా సావడం. అలా సావడం కన్నా ఇదే మేలు. అందుకే నేనూ, నడిపోడు కలిసి ఒప్పుకున్నాం. చిన్నోడికీ చెప్పినాం. వాడు బెదురు గొడ్డు. రానన్నాడు. నాయనా ... మాకూ బాగా బతకాలనే వుంది. కానీ బతికే దారిలేదు. ఈ తప్పు నీది నాది కాదు. ఈ రాత రాసినోడిది" అని ఇల్లొదిలి ఎలబారి పోయె.

ఆల్లెక్కడో -

ఆడ కనిపించారు. ఈడ కనిపించారు అన్నారు కొందరు. తనకంట పల్లా.

నిజమే వాడన్నట్లు బతికే మార్గమేది ? చావడానికే బతుకయినప్పుడు ఎవరైనా ఎట్టా బతుకుతారు. వాడు అంతే. తనూ తనలాంటి వాల్లు కూలికి మొగం వాచిపోయి వున్నారు. కూలికి పిలిచే వోడేడీ ?

గవర్నమెంటు కూలికి పిలవాల.

పనిగి గింజలనిరి. ఇంటికి ఇద్దరు. సాలుకు నూర్రోజుల పని అనిరి. అదేందో రోజుగారి పనులనిరి. నేరుగా సేయిత్తామనిరి. సివరకు కాంటాక్టర్ల సేతిలో పెట్టిరి. ఎవరో ఒకర్లే పనికి పిలిస్తే సాలని చూస్తే ... ఎవరూ పిలవరు. ఎవడి మనుసుల్ని వాడు పిలుసుకో బట్టిరి. పోనీలే ఎవడో ఒకడికి కూలి దొరుకుతాందిగదా అనుకుంటే మిసన్లు పెట్టి పనులు చేసిరి. అందరి కడుపులు కొట్టిరి. ఏంది సామీ ! అంటే అన్నింటికీ ఒక్కటే పాట. వానల్లేవు. అందుకే మీరు ... నీరు అనిరి. ఏ జన్మలో పాపమో గదా ఈ బూమీమ్మీద వుడితి. నాయంలేదు. దరమం లేదు. థూ ... జీవితం మీద రోత గలిగి వుమ్మేశాడు.

"రోయ్ ... ఎవ్రా అది !" చెట్టు చాటున పడుకున్నోడు లేచాడు.

చెరువుగట్టున లేత వెన్నెల వెలుగులో నిగనిగలాడుతుంది. చెరువు మధ్యలో రాక్షసుడిలా ప్రొక్లైనర్.

"ఎవ్రా అది ... పలకరేటి ?" దగ్గరకొచ్చాడు.

"నువ్ ఎవ్రా ! నన్నడగతా వుండావు"

"నేనా ... అదో ఆ మిసనుకు కాపలా ..."

"రాచ్చస రాజ్జానికి లంకిని కాపలా ..." నవ్వాడు నాగన్న.

నాగన్న నోటినుండి వస్తున్న వాసన చల్లటి వెన్నెల్లో తడిసి అవతలవాడి తలదిమ్ము వదిలించింది.

"ఒరే ముసల్లంజికొడకా. తాగినోడివి ఓ మూల తొంగి ఓలా సీకట్లో సెరువుద్దారి పడితివేంది .... ఎల్లు బేగ్ల్లు

... మ్మ దొంగనా కొడకా ... నీ యమ్మ యాడను డో వచ్చిన్నాకొడుకువి ... వూరోడిని. ఈ నాగన్ననే లంజకొడుకంటావా ? నిన్ను నరికేస్తా నా కొడకా... నీ యమ్మ నువ్వు ... నీ ఓనరు ... ఎవరొస్తారో రండి ... నరికి పారేస్తా ... అని నడుంలో దోపుకున్న కొడవలి తీశాడు.

"ఓరి బావూ ... దండవెడతా ! తప్పయింది. పో ఇంటికి పోయి ...."

"నే నేడికీ పోను. వచ్చిన పని పూర్తి కాలే. ఇదో పెట్రోలు డబ్బా ... పెట్రోలు ఆ రాచ్చసి మీద పోసి అంటించి గాని పోను".

"అదేంటి సేసిందిరా ముసలీ ! మీ వూరి సెరువు. ఎప్పుడో ఆయెనవరు మారాజు కిష్ణదేవరాయలు తవ్వించాడా ! ఆరోజునుండి దిక్కు. దివానం లేక పూడిపోయె. పూడికి తీస్తే రేపు నాలుగు చినుకులు బడితే ఆ నీల్లు ఈడ నిలవ్వా ! మీ బతుకులు తడవ్వా ! పూడికి తీసే మిసన్ను కాలస్తావా ? అన్నం పెట్టిన సెయ్యిని నరకడమేదిరా ... తిన్నింటి ఓసాలు లెక్కపెట్టడం ఇదే".

"ఓఁనా అట్టాగే కనిపిస్తుంది. ఏదిరా అన్నం పెట్టే సెయ్యి. ఏదిరా అన్నం. ఒరే దొంగ నా కొడకల్లారా ! బాగా ఇనుకోండి. నేను తాగి తూలి వాగడంలా.. విను. వారంరోజులుగా ఈ మిసను పదిమంది మనుసులు కలిసి సెరువు మొత్తం పూడికి తీసి గట్ల బంద్రం సేసినారు. ఎంత మింగినార్రా ! ఒరే వారంలో ఏడు లచ్చలు మింగినార్రా ! మీ మిసను. మీ పదిమంది కలిసి...

మా కన్నీళ్ళు ... మీరు మా కన్నీళ్ళతో మీ పంట పండించుకుంటున్నారా !

అదే ఏడు లచ్చలు నూరు మంది కూలోల్లకు రోజుకు నలభై లెక్కన ఎన్ని నెల్లు బతుకు దెరువురా ? ఒక్క కూలోడి కూలిమీద మూడు పానాలు నిలిచేవి. మా కడుపులు నోళ్ళు కొట్టి ఈ మిసన్లకు పెడతార్రా !

వూల్లను స్మశానాలు సేసి దున్నండిత మా పానాలు ఎరువులు. మా కన్నీల్లలో తడుపుకోండి. మీ నోల్లని" అంటూ కొడవలిని విసురుగా ఊపాడు.

"ఓర్నాయనో ఈడు సంపేలా వున్నాడు". మనసులో మాట పైకి రాగా "రచ్చించండి ... రచ్చించండి" అంటూ వూరి వైపు పరుగు తీశాడు.

"రాచ్చసుల్ని సంపాల్సిందే ... రచ్చించరు నా కొడకా!

పదిమంది కూడు ఒక్కడు తింటే చంపేస్తా !
పదిమంది పని ఒక్కడు సేసినా సంపేస్తా !”

పారిపోయిన వాడి మీది చూపుని చెరువు వైపు సారించాడు. చెరువులోనికి దిగాడు. ప్రొక్లైనర్ వైపు అడుగులేశాడు.

“నీయమ్మ మా కడుపులు మాడ్చి ... మా ఆర్నెల్ల కూలి వారం రోజుల్లో మింగి మత్తుగా నిద్ర పోతుండావా?”

ఆనాడు కాళిందిలో గోవుల్నిదిన్న విసప్పురుగులా మత్తుగా వున్నావు. నీ పొగరు నీననుస్తా ! అంటూ దాని చెంతకు పరిగెత్తేడు.

తెచ్చిన పెట్రోలు దాని గుండెల మీద చిలకరించాడు. డబ్బా ఖాళీచేసి కిందపడేసి అటూ ఇటూ చూశాడు. అంత దూరాన ఒక సుత్తి కనిపించింది. అది తీసుకొని దుశ్శాసనుడి మీదకు దాడిచేసిన భీముడిలా ప్రొక్లైనర్ గుండెలని బద్దలుకొట్టాడు. కసి తీరాక విజయగర్వంతో వీరావేశంతో మీసాలు మెలేస్తూ ఇవతలకొచ్చి బీడీ నోట్లో పెట్టుకుని అల్లంత దూరం నడిచి అగ్గిపెట్టె తీసి బీడీ వెలిగించుకొని విలాసంగా మండుతున్న అగ్గిపుల్లని విసిరాడు.

భగ్గుమని మంటలు -
యజ్ఞగుండంలో మంటల్లా చెరువులో మంటలు.
మంటల్లో రాక్షస సంహారం
ఆ మంటల్లో
పది తలల రావణాసురుడు కూలాల్సిందే
వంద తలల రాకాసులూ కూలాల్సిందే
నేల కడుపులు బకాసురులు కూలాల్సిందే
అంతవరకూ ఈ యజ్ఞం సాగాల్సిందే

**ఎర్రి నాగన్నలు యాగ సంరక్షణకు నడుం బిగించాల్సిందే** ✪

**(కథాభారతి సంచికలో బహుమతి పొందిన కథ)**

✣ ✣ ✣ ✣ ✣

